క్లుప్తంగా

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన బార్ అసోయేషన్ సభ్యులు



పిడుగురాళ్ల: గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తిని పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి మాట్లాడుతూ... పిడుగురాళ్ల నూతన కోర్టు బిల్డింగ్ నిర్మించేందుకు కృషి చేసినందుకు బార్ అసోసియేషన్ తరుపున జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసినట్లు చెప్పారు.

రెంటచింతల ఈఓ పరిధిలోకి పాలువాయి దేవస్థానం

రెంటచింతల: మండలంలోని పాత పాలువాయిలోని గంగా భ్రమరాంబ సమేత కాశోస్తేశ్వర స్వామి దేవస్థానం రెంటచింతల ఈఓ పరిధిలోకి మార్పు చేస్తూ ఉప కమిషనర్ దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి శనివారం తెలిపారు. ఇప్పటి వరకు ఈ దేవస్థానం గురజాల ఈఓ పరిధిలో ఉన్నట్లు వివరించారు.

ఆగస్టు 9న బైబిల్ క్విజ్ పోటీలు

మాచర్ల: బైబిల్ క్విజ్ పోటీలు ఆగస్టు 9న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పాస్టర్ సీఎస్ జాషువా, కన్వీనర్ పాస్టర్ శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని రెంటచింతల మండల కేంద్రమైన హౌస్ ఆఫ్ ప్రెయర్ చర్చి, రైల్వే స్టేషన్ రోడ్డు పక్కన పోటీలు ఉంటాయని చెప్పారు. మొదటి స్థానం సాధించిన వారికి రూ.3 వేలు, ద్వితీయ స్థానం రూ. 2 వేలు, తృతీయ స్థానం రూ.1000 బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనదలచని వారు ఆగస్టు ఒకటి లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. దైవ సేవకులు, పాస్టర్ ట్రైనింగ్ చేసిన వారు ఈ పోటీలో పాల్గొనరాదన్నారు. ప్రతి టీంకు ముగ్గురు చొప్పున పాల్గొనాలని, ఒక టీం రూ.50 చెల్లించాలన్నారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9292101029, 8309118960 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహిళలపై దాడి చేయడం అమానుషం



గురజాల: బీసీ మహిళపై దాడి చేయడం అమానుషమని బీసీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి టీడీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటుందని ఆరోపించారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయానికి ట్యాంకర్లతో శనివారం తాగునీరు సరఫరా చేశారు. ఇరికేపల్లిలోని ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగేండ్ల సుమతి రత్నం ప్రత్యేక చొరవ తీసుకొని ట్యాంకర్ ద్వారా తాగునీటిని అందించారు. విద్యాలయం లో తాగునీరు సమస్య రావటంతో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుమతీ రత్నం స్పందించి చర్యలు తీసుకున్నారు.

పిడుగురాళ్లలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం

పిడుగురాళ్ల: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పిడుగురాళ్ల మండల సమాఖ్య వెలుగు కార్యాలయం ప్రాంగణంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయం ఎందురుగా ఉన్న పిచ్చి మొక్కలను కార్యాలయ సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరమణరావు, సీసీలు సురేష్, కోటేశ్వరరావు, రామస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగిస్తాం

నూజెండ్ల: మండల పరిధిలోని ఐనవోలు పంచాయితీ యోగిరెడ్డిపాలెం గ్రామంలో వివాదాస్పద భూమిని తహసీల్దార్ రమేష్ కుమార్ శనివారం పరిశీలించారు. గ్రామంలోని ఉన్న కుంట పోరంబోకు భూమిని సర్వే చేసి ఆక్రమణలు తొలిగించాలని తహసీల్దార్‌కు ఇటీవల గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఆదేశాలతో సర్వేయర్ చండీరాణి భూమిని సర్వే చేసి సర్వే నెం 105 ఎ లో 3.15 సెంట్లు కుంట పోరంబోకుగా తేల్చారు. మిగిలిన 105 1బి లో 87 సెంట్లు వేరొకరి ఆధీనంలో ఉందని నిర్ధారించారు. కుంట పోరంబోకు భూమి సబ్ డివిజన్ జరగలేదని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఆక్రమణలు చేశారని గ్రామస్తులు వివరించారు. సమగ్ర విచారణ చేసి చర్యలు చేపడతామని తహసీల్దార్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

వంచనకు గురిచేసిన సీఎం చంద్రబాబు



మాట్లాడుతున్న జిల్లా నాయకుడు బాలునాయక్, వేదికపై జెడ్పీటీసీ మల్లుస్వామి, తాడి వెంకటేశ్వరరెడ్డి



హాజరైన వివిధ గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు

- ప్రతి గ్రామంలో బాబు మోసాలపై విస్తృత ప్రచారం
- బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు

మాచర్ల: ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలను మోసగించటంతో పాటు వెన్నుపోటు రాజకీయాలు అలవాటని వెల్దుర్తి, మాచర్ల జెడ్పీటీసీ సభ్యులు కేతావత్ బాలు నాయక్, మల్లుస్వామి, జిల్లా నాయకులు తాడి వెంకటేశ్వరరెడ్డి, కోట్ల పాపిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ కార్యాలయంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం గురించి వెల్దుర్తి మండల విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. అధ్యక్షుడు కోట్ల పాపిరెడ్డి, సమన్వయకర్త పోతురెడ్డి కోటిరెడ్డి, నవులూరి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిపారు. వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆ పథకాలన్నింటి కన్నా ఎక్కువ ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక డబ్బులు లేవని చెప్పలేదని, సీఎం చంద్రబాబు లాగా చేతులెత్తేయలేదన్నారు. ఇప్పటికీ మోసం చేయటమే భాగంగా సీఎం చంద్రబాబు, జగన్ మోహన్‌పై ఎదురుదాడి చేస్తూ హామీల అమలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి రావటం కోసం ఎప్పుడూ ప్రజలను మోసగించటమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చాక తనదంతా హైటెక్ అని చెప్పి చదువుకు, సంక్షేమానికి దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి, పోలవరం పేరుతో ముందుకెళ్తూ ఇప్పటికీ సూపర్ సిక్స్ అని చెప్పి 15 నెలలైనా పింఛన్, తల్లికి వందనం కార్యక్రమాన్ని మాత్రమే అమలు చేశారన్నారు. మిగిలినవన్నీ ఇచ్చే పరిస్థితి లేదని చెప్పారు. ఇటువంటి విధానాలను అనుసరిస్తున్న కూటమి ప్రభుత్వంపై గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకెళ్తామన్నారు. మండల ఉపాధ్యక్షులు గోపాల్, మాజీ సొసైటీ అధ్యక్షుడు పుల్లారెడ్డి, కారంపూడి జెడ్పీటీసీ షేక్ షఫి, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసపూరిత చర్యలను ప్రచారం చేసి మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. తొలుత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు యేరువ ప్రతాప్‌రెడ్డి, నవులూరి చెన్నారెడ్డి, జిల్లా యూత్ ప్రెసిడెంట్ దేవిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షులు ఈగల అయ్యన్న, రవీంద్ర నాయక్, ఆయా గ్రామ సర్పంచులు శీలం సైదారెడ్డి, బలిగొడుగుల శ్రీను, గుంటక చెన్నారెడ్డి, ఎంపీటీసీ కాంతారావు, ముక్కాల కోటిరెడ్డి, మాజీ సర్పంచి అయ్యన్న, అమరయ్య, ఉప్పలపాడుకు చెందిన మందా శీతారామిరెడ్డి, పి.గాలయ్య, కంపసాటి బసవయ్య, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, రవి, బొజ్జా అంజిబాబు, బాలునాయక్, రామాంజి, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

కెనడీ ఆదర్శనీయులు



మాచర్ల: మాచర్ల కోర్టులో కెనడీ చిత్రపటావిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ పాల్గొని మాట్లాడుతూ కెనడీ వృత్తిని దైవంగా భావించి నిర్వర్తించారని కొనియాడారు. ఆయన అందరికీ ఆదర్శనీయుడని చెప్పారు. చిత్రపటావిష్కరణ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గట్ల సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాసరావు, చల్లా నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్లాల రమేష్ బాబు, జూపల్లి శ్రీనివాసరావు, గౌస్ బాషా, గాలి సాహెబ్, ఉదయ భాస్కర్ రెడ్డి, గంగుల శ్రీనివాసరావు, గంజి ప్రసాద్, రామారావు, కుటుంబ సభ్యులు చరణ్ చైతన్య, చక్రధర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సాయి, కొండారెడ్డి పాల్గొన్నారు.

నేడు బోనాలు సమర్పణ

గురజాల: వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ కనకదుర్గ అమ్మవారికి ఆదివారం బోనాలు సమర్పించేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు గాంధీబొమ్మ సెంటర్ నుంచి మహిళలు బోనాలతో బయలుదేరడం జరుగుతుందన్నారు.

చెవిలో పువ్వులతో నిరసన



చెవిలో పువ్వులతో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు

పిడుగురాళ్ల: మున్సిపల్ కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త సమ్మె శనివారానికి ఏడో రోజుకు చేరింది. ఏడో రోజు చెవిలో పువ్వులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాష్ట్రానికి స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అవార్డు రావడం గర్వకారణంగా అని, అవార్డు మన మున్సిపల్ కార్మికుల నిరంతరం శ్రమ ఫలితంగా వచ్చిందని, సొమ్మొకడిది, సోకు ఒకడిది అన్నట్లుగా మున్సిపల్ కార్మికులు కష్టపడితే, మంత్రులు అవార్డు తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ ఉత్తమ మున్సిపల్ అవార్డు అందుకుంటూ కార్మికులకు మాత్రం నోటీసులు అందజేయడం హేయమైన చర్య అని ఆయన విమర్శించారు. రెండు, మూడు రోజుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు రత్నబాబు, నాగూర్, మొగిలి నాగేశ్వరరావు, రమేష్, విజయ్, గాలి పవన్‌కుమార్, విజయసారధి, గద్దె శ్రీనివాసరావు, బత్తుల రామారావు, అంగిడి శ్రీనివసారావు, బత్తుల రామారావు, అంగిడి శ్రీనివాసరావు, బత్తుల గురవయ్య, డ్రైవర్ వెంకటేశ్వర్లు, కొమ్మర గురవయ్య, దేవరకొండ మార్తమ్మ, కృష్ణవేణి, కొండలు పాల్గొన్నారు.

జీవన ఎరువులపై దృష్టి సారించాలి

జిల్లా శిక్షణ కో ఆర్డినేటర్ శివకుమారి



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా శిక్షణ కో ఆర్డినేటర్ శివకుమారి

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని వీరాపురం గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం వారి ఆధ్వర్యంలో శనివారం రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కారన్యక్రమంలో జిల్లా శిక్షణ కో ఆర్డినేటర్ ఎం.శివకుమారి మాట్లాడుతూ... రైతులు పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులను అధికంగా వాడుతున్నారని, దీని వల్ల భాస్వరం ఉపయోగపడకపోగా సూక్ష్మపోషకలోపాలు కూడా వస్తాయని, కనుక మెట్టపంటలకు విత్తన నెల రోజులలోపల, వరికి నాటిన 10 రోజుల లోపల కాంప్లెక్స్ ఎరువులు వాడాలని తెలిపారు. పీఎం ప్రణామ్ పథకం కింద సేంద్రియ జీవన ఎరువులు వాడి, రసాయ ఎరువులు వాడకాన్ని తగ్గించినట్లుతే కంపెనీ వాళ్లకు వెళ్లే రాయితీలు ప్రభుత్వానికి వస్తాయని, తద్వారా రాష్ట్ర అభివృద్ధి తోడ్పడినవారు అవుతున్నారని ఆయన ఆమె తెలిపారు. పురుగు మందులు కూడా అవగాహన లేకుండా 2 నుంచి 4 మందులు కలిపి వాడడం వలన జీవులు చనిపోవడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారిణి ఎం.సంధ్యారాణి పాల్గొన్నారు.

స్మృతివనానికి స్థలం కేటాయింపు హర్షణీయం



గాంధీచౌక్‌లో జాతీయ నేతల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘుల నాయకులు

సత్తెనపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనానికి ప్రభుత్వం స్థలం కేటాయించటం హర్షణీయమని సత్తెనపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ కొల్లిపర కాశీ విశ్వనాథం అన్నారు. పట్టణ ఆర్య వైశ్య చలివేంద్ర సంఘం, పట్టణ ఆర్య వైశ్య సంఘం, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్‌లో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి శనివారం క్షీరాభిషేకం చేసి పూలమాల వేశారు. అనంతరం అక్కడ ఉన్న మిగిలిన జాతీయ నాయకుల విగ్రహాలకు పూల మాలలు వేశారు. కొల్లిపర కాశీవిశ్వనాథం మాట్లాడుతూ ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాములుకి అరుదైన గౌరవం ఇవ్వటం ఆనందదాయకమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు కందకట్ల శంకర్, బచ్చు వెంకటేశ్వర్లు, అన్నం బాల సుబ్రమణ్యం, చల్లంచర్ల కళ్యాణ్, జవ్వాజి రామమోహనరావు, పెంద్యాల కాశీ మల్లేశ్వరరావు, పోతుగంటి రామకోటేశ్వర రావు, దివ్వెల శ్రీనివాసరావు, పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ, కాపుగంటి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని అడ్డుకోండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



పాతబస్టాండ్ సెంటర్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు

సత్తెనపల్లి: విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి అదానీ కంపెనీ సిబ్బంది వస్తే ఆయా ప్రాంతాల ప్రజలంతా ఐక్యంగా అడ్డుకోవాలని, మీకు సీపీఎం అండగా ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ప్రజలకు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పాత బస్టాండ్ సెంటర్లో సీపీఎం బృందంతో శనివారం ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రమాదాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బాబురావు మహిళల వద్ద ఉన్న పెరిగిన విద్యుత్ బిల్లులను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో వందల్లో వచ్చే విద్యుత్ బిల్లులు ఇప్పుడు వేలల్లో వస్తున్నాయని మహిళలు ఆయనతో వాపోయారు. గత ఎన్నికలలో కూటమి పార్టీలు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు అదానీ కంపెనీ తో ఒప్పందం కుదుర్చుకొని స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ పాపంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ భాగస్వాములేనన్నారు. ప్రజల సొమ్మును కార్పొరేట్లకు దోచి పెట్టే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టేందుకు సీపీఎం నిర్వహించే ప్రజా ఉద్యమాలలో మీరంతా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, జిల్లా కార్యదర్శి వర్గ స భ్యులు ఏబీఎస్ గోపాలరావు, వై రాధాకృష్ణ, న్యా యవాది పిన్నమనేని పాములయ్య, పట్టణ కార్యదర్శి డి విమల, మండల కార్యదర్శి పి.మహేష్, జి.మల్లేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

సాధనా సామర్థ్యాలతో ఉత్తమ ఫలితాలు

డీఈవో చంద్రకళ

నాదెండ్ల: విద్యార్థులకు సాధనా సామర్థ్యాల ద్వారా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించి ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో చంద్రకళ చెప్పారు. మండలంలో ఐదు క్లస్టర్లు గణపవరం, నాదెండ్ల, సాతులూరు, చిరుమామిళ్ళ, ఎండుగుంపాలెంలలో కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. శనివారం సాతులూరులో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో డీఈవో చంద్రకళ హాజరై ఉపాధ్యాయులకు సామర్థ్యాలపై తగిన సూచనలు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం ఐదు గంటల వరకూ జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. నాదెండ్లలో జరిగిన కాంప్లెక్స్ సమావేశాల్లో ఎంఈవో కృష్ణారెడ్డితో పాటూ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు. మండలంలో జిల్లా పరిషత్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఏపీ మోడల్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో జరిగాయి.

గంగమ్మ తల్లికి ఆషాఢం సారె



సత్తెనపల్లి: పట్టణంలోని దోబీఘాట్(రజకుల) కాలనీలో గల గంగమ్మతల్లి అమ్మవారికి ఆషాఢ సారెను శనివారం భక్తులు సమర్పించారు. 35 సంవత్సరాల క్రితం వెలిసిన గంగమ్మ తల్లిని రజకులు తమ కులదైవంగా పూజిస్తున్నారు. ధోబి ఘాట్‌లో ఉన్నటువంటి సుమారు 500 కుటుంబాలవారు గంగమ్మ తల్లికి ఆషాఢ సార రూపంలో ప్రతి ఇంటి నుంచి ఏదో ఒక ప్రసాదం చేసుకొని అంగరంగ వైభవంగా ఊరేగింపుగా బయలుదేరి మధ్యాహ్నానికి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన ముత్తయిదులవుకు అన్న సంతర్పణ, ఆషాఢ సారెను అందించారు. దోబీ ఘాట్ కమిటీ సభ్యులు, దోబీ ఘాట్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం

సత్తెనపల్లి: సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులు హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు బైఠాయించారు. కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ జనాభాకు తగ్గట్టుగా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్మిక సంఘ నాయకులు, మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులు, ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వేణుబాబు



ప్రతిజ్ఞ చేయిస్తున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్

మాచర్ల: ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు కోరారు. శనివారం పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది, కార్మికులు ప్లాస్టిక్ నిషేధిద్దాం- పట్టణాన్ని పరిరక్షిద్దామంటూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు కొనసాగింది. కమిషనర్ వేణుబాబు ప్లాస్టిక్ రహిత పట్టణంగా మారుద్దామని ప్రతిజ్ఞన చేయించారు. పట్టణంలోని పలు షాపుల వద్ద ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్ సంచులు వాడొద్దు..

రెంటచింతల: వాతావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ సంచులు వాడొద్దని ఎంఈఓ వై.శివనాగేశ్వరరావు సూచించారు. మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛంద్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామ పురవీధులలో ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సమాజాన్ని పీడిస్తున్న ఈ ప్లాస్టిక్ వస్తువులను నిర్మూలించేందుకు అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వస్తువుల ఉపయోగించడం వలన కలిగే నష్టాలను విద్యార్థులు వారి తల్లి దండ్రులలో అవగాహన కలిపించినప్పుడే వాటి వినియోగం తగ్గిపోతుందన్నారు. అనంతరం ప్రధాన రహదారిపై స్కూల్ ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్, స్వచ్ఛంద్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ చిలుకూరి శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.శ్రీకాంత్‌రెడ్డి, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మారుద్దాం

పిడుగురాళ్ల: పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మారుద్దామని మున్సిపల్ కమిషనర్ ఐ. శ్రీనివాసులు అన్నారు. అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పట్టణంలోని ఎవరికి వారు ప్లాస్టిక్ నిరోధించేందుకు కృషి చేయాలన్నారు.



పొలం బాట పట్టిన రైతులు


దాచేపల్లి: వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు పొలం బాట పట్టారు. పొలంలో విత్తనాలు నాటడం ప్రారంభించారు. శుక్రవారం, శనివారం విస్తారంగా వర్షం కురవటంతో పొలాల్లో నీరు పారాయి. విత్తనం వేసేందుకు అనుకూలంగా ఉండటంతో కూలీలతో రైతులు పత్తి విత్తనాలు నాటిస్తున్నారు. అదేవిధంగా ఇతర వాణిజ్య పంటలు వేసేందుకు పొలాలను సన్నద్ధం చేస్తున్నారు. వర్షాలు కురవడం ఇప్పటికే ఆలస్యం కావడంతో తాజాగా కురిసిన వర్షంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు.

బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నరసరావుపేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు బీసీలకు రక్షణ చట్టం తేవాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వెంటనే కల్పించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. శనివారం మున్సిపల్ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. జనగణనలో సమగ్ర కులగణనను కేంద్రం చేపడుతున్నందున ముందుగా విధివిధానాలు బహిర్గతంచేసి జాతీయస్థాయిలో జనగణన అనంతరం ఎస్సీ–ఎస్టీల మాదిరిగానే ఓబీసీలకు కూడా జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థలలో 34 శాతం, చట్టసభలలో 33 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇచ్చేలా కూటమి సర్కారు ఎన్నికల వాగ్దానం చేసిందన్నారు. కులగణన తర్వాత మాత్రం జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు పెంచేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేయాలని కోరారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, యువజన అధ్యక్షులు సుతారం విశ్వేశ్వరరావు, రొంపిచెర్ల మండల అధ్యక్షులు గాలి సాంబశివరావు పాల్గొన్నారు.

ముగిసిన చేతిరాత శిక్షణతరగతులు



చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని సుబ్బయ్యతోటలోని వికాస్ విద్యసంస్థలో ప్రముఖ క్యాలిగ్రఫీ నిపుణులు వై.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన ప్రత్యేక కర్సివ్ హ్యాండ్ రైటింగ్ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో, అక్షరాల మధ్య బంధాన్ని నిర్మించి రాయడం వలన సమయాన్ని ఎలా ఆదా చేసుకోవాలనే విషయాలను విద్యార్థులకు వివరించారు. చేతిరాత క్రమబద్ధత విద్యార్థుల్లో అంకితభావాన్ని పెంపొందించడానికి కీలకమని తెలిపారు. విద్యార్థుల మౌలిక నైపుణ్యాల పెంపు కోసం వివిధ రంగాల్లో నిపుణులతో తరచూ శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నామని వికాస్ డైరెక్టర్లు దండా పవన్ కుమార్, రోజశ్రీ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్స్ కల్పన, శ్యాంబాబు పాల్గొన్నారు.